RNI NO. TELTEL/2023/87655

20-06-2025

# దీక్ష ప్రభ

శుక్రవారం

సంపుటి : 03 సంచిక : 67 పేజీలు : 4 | రూ.5

www.deekshaprabha.com


Follow: deekshaprabha


## తిరుమలలో ఇకపై ఆర్టీసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

**తిరుమల, దీక్షప్రభ:** తిరుమలలో భక్తులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరవేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచిత సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి సర్కిల్ వద్ద గురువారం ఆయన జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. తిరుమలలో భక్తుల నుంచి ప్రైవేటు వాహనాల వారు అధికంగా డబ్బులు వసూలు చేయడాన్ని అరికట్టేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు బస్సులను ఉచితంగా తిప్పాలని ఏపీఎస్ ఆర్టీసీని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం.. తిరుమలలో బస్సులను ఉచితంగా నడిపేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇందుకు ఆర్టీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలు (ఉచిత బస్సులు) తిరిగే మార్గంలోనే ఆర్టీసీ బస్సులు తిరుగుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తాయని వెల్లడించారు.







# మెట్రో ఫేజ్-2 మంజూరు చేయండి

### కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

### బ్రిటన్ మాజీ ప్రధాని బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి భేటీ


### 'తెలంగాణ రైజింగ్ విజన్'పై బ్లెయిర్ సంస్థతో ఎంవోయూ

**దిల్లీ, దీక్షప్రభ:** హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు సత్వరమే అనుమతి మంజూరు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సీఎం గురువారం ఇక్కడ కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. "వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో రెండోదశ అవసరం చాలా ఉంది. రూ.26,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇది కార్యరూపం దాలిస్తే నగరంలో రాకపోకలు వేగంగా సాగుతాయి. రహదారులపై రద్దీ తగ్గుతుంది. పర్యావరణ, సుస్థిరాభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సూచనల మేరకు డీపీఆర్‌లో అవసరమైన సవరణలు చేసి సమర్పించాం. ఈ ప్రాజెక్టుకున్న అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచీ అవసరమైన అనుమతులు ఇప్పించండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి విన్నవించారు.

#### 'తెలంగాణ రైజింగ్'కు టోనీ బ్లెయిర్ అభినందన

సీఎం రేవంత్‌రెడ్డి తన దిల్లీ పర్యటనలో యునైటెడ్ కింగ్‌డమ్ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్‌తో భేటీ అయ్యారు. 1997-2007 మధ్య యూకే ప్రధానిగా పనిచేసిన అనంతరం రాజకీయాల నుంచి వైదొలగిన బ్లెయిర్.. టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ ఛేంజ్ (టీబీఐజీసీ)ను స్థాపించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నాయకులకు విజన్, వ్యూహాల రచన, వాటి అమలులో సహకరించడం దీని లక్ష్యం. ఇలా భారత్‌లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించడానికి బ్లెయిర్ దిల్లీకి వచ్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. సుమారు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో.. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంలోని కీలకాంశాలను బ్లెయిర్‌కి ముఖ్యమంత్రి వివరించారు. ఈ విధానపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవమైన డిసెంబరు 9న విడుదల చేయబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాల గురించి వివరించారు. రైతులు, యువత, మహిళల ఆర్థికాభివృద్ధితోపాటు, మానవాభివృద్ధి సూచికలను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యల గురించి చెప్పారు. రాష్ట్రాన్ని పట్టణ, శివారు, గ్రామీణ జోన్లుగా విభజించి సూక్ష్మప్రణాళికలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను బ్లెయిర్ అభినందించారు. భారత్ ఫ్యూచర్‌సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్' రూపకల్పనతోపాటు, దాని అమలులో పాలుపంచుకోవడానికి టీబీఐజీసీ, తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సమావేశాల్లో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు మల్లురవి, రఘువీర్‌రెడ్డి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల విభాగం సీఈఓ జయేశ్‌రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టీబీఐజీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదల కలలు నెరవేర్చడమే లక్ష్యం



**తుర్కపల్లి, దీక్షప్రభ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల కలలు నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత గ్రామమైన యాదాద్రి భువనగిరి జిల్లా వాసాలమర్రిలో గురువారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నిరుపేదలకు 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. మొదటి విడతగా 4.5 లక్షల ఇళ్లు కట్టించాలని నిర్ణయించామని తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పాలనలో 24 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలన్నింటినీ పరిష్కరించనున్నట్లు చెప్పారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్లను ప్రభుత్వం నియమించనుందని పేర్కొన్నారు.

#### వాసాలమర్రిని కేసీఆర్ ఆగం చేశారు...

మాజీ సీఎం కేసీఆర్ దత్తత పేరుతో మాయమాటలు చెప్పి తన స్వార్థం కోసం ఫాంహౌస్‌కు వెళ్లేందుకు వీలుగా వాసాలమర్రిలో ఇళ్లు కూల్చి.. విశాలమైన రోడ్డు వేసుకున్నారని, గ్రామస్థులను ఆగం చేశారని మంత్రి ధ్వజమెత్తారు. ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పి... ఒక్క ఇల్లు కూడా కట్టకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. గ్రామానికి 227 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. వాసాలమర్రి వాసులతో సమావేశమైన సందర్భంగా గ్రామానికి చెందిన ఆకుల ఆగమ్మను అన్నివిధాలా ఆదుకుంటానని గతంలో సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ మాట ఇచ్చారని, దాన్ని నెరవేర్చలేదని మంత్రి విమర్శించారు. ఆగమ్మకు మంత్రి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇందిరమ్మ ఇంటి పట్టా అందజేశారు. అయిలయ్య రూ.లక్ష సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ చైతన్య, కలెక్టర్ హనుమంతరావుతదితరులు పాల్గొన్నారు.


## నేడు ఎల్బీ స్టేడియంలో యోగా కౌంట్‌డౌన్ మహోత్సవం

### ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**నారాయణగూడ, దీక్షప్రభ:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఎల్బీ స్టేడియంలో కౌంట్‌డౌన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం సాయంత్రం భాజపా నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావులతోపాటు శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని వివరించారు. సినీనటులు ఖుష్బూ, మీనాక్షి చౌదరి, సాయిదుర్గా తేజలు కూడా పాల్గొంటారని తెలిపారు.

## 'గోదావరి-బనకచర్ల అంశం'.. త్వరలో ఇద్దరు సీఎంల భేటీ ఏర్పాటు చేస్తామన్నారు: ఉత్తమ్



**దిల్లీ, దీక్షప్రభ:** గోదావరి-బనకచర్ల చట్ట వ్యతిరేకమైన ప్రాజెక్టు అని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టుపై దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు అభ్యంతరాలను తెలియజేసిన అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. "బనకచర్లపై ఆందోళనలను కేంద్ర మంత్రికి వివరించాం. ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రజలు, రైతుల్లో ఆందోళనలు ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పారు. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా చూడమని కోరాం.

ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్ లింక్‌తో పెన్నా బేసిన్‌కు నీరు తీసుకెళ్లొచ్చు. ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధాన అంశంపై చర్చకు సిద్ధమని చెప్పాం. త్వరలో ఇరు తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి పాటిల్ హామీ ఇచ్చారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఇంకా అనుమతులు లభించలేదు. ఏపీ ప్రాజెక్టులకే త్వరగా అనుమతులిస్తున్నారని చెప్పాం. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుకు నిధులివ్వాలని కోరాం. రాష్ట్ర ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశాం. పాలమూరు- రంగారెడ్డి, సమ్మక్క సారక్క, తుమ్మిడిహట్టికి కేటాయింపులు కోరాం" అని ఉత్తమ్ తెలిపారు.

## దొంగను దొంగ అంటే ఒప్పుకొంటాడా?



**శ్రీకాకుళం, దీక్షప్రభ:** 'మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీరు అలీబాబా 40 దొంగల కథ మాదిరిగా ఉంది. దొంగలు ఎక్కడైనా దొంగతనం చేశామని ఒప్పుకొంటారా?' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. శ్రీకాకుళంలో గురువారం కాంగ్రెస్ జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదని జగన్ అంటే ఎలా? తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మా ఇంటికొచ్చి ఫోన్ ట్యాప్ చేసిన ఆడియో వినిపించారు. బైబిల్‌పైన, నా బిడ్డల మీద ప్రమాణం చేసి చెబుతున్నా. సుబ్బారెడ్డి చేతిలో ఆడియో ఎందుకుందో.. ఎలా వచ్చిందో ఆయన తన బిడ్డల మీద ప్రమాణం చేయాలి. ఈ విషయమై ఆయన్ను విచారణ చేయాలి. గతంలో నాకు సుబ్బారెడ్డితో సన్నిహిత సంబంధాలన్నాయి. అప్పుడే నాకు ఆడియో వినిపించారు.

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు.. కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..వారి సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలకు దిక్సూచిగా మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

దీక్ష ప్రభ
తెలుగు దినపత్రిక

మీకో చక్కని వేదికగా నిలుస్తోంది. ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి

95500 21491



## రాష్ట్రంలో గ్లోబల్ గుడ్‌గవర్నెన్స్ ఇన్‌స్టిట్యూట్

### ఏర్పాటుకు టోనీబ్లెయిర్ సంస్థ సహకారం • బ్రిటన్ మాజీ ప్రధాని బ్లెయిర్, ఏపీ మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందం

**దిల్లీ, దీక్షప్రభ:** ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారం అందించడంపై ఏపీ ప్రభుత్వం, టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్‌లు గురువారం దిల్లీలో ఒప్పందం చేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన పత్రాలపై రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్.. బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్‌ల సమక్షంలో ఇరుపక్షాలూ సంతకాలు చేశాయి. ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ ఛేంజ్ (టీబీఐ)ను ఏర్పాటుచేసి వివిధ రంగాల్లో ప్రపంచ దేశాలకు సాయం చేస్తున్న టోనీ బ్లెయిర్‌తో పలు అంశాలపై లోకేశ్ మాట్లాడారు. గత ఏడాది జులైలో బ్లెయిర్‌ను ముంబాయిలో లోకేశ్ కలిసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యావ్యవస్థలో ఏఐ టూల్స్ ఉపయోగించడానికి తమ సంస్థ తరఫున సహకారం అందించేందుకు ఆయన అంగీకరించారు. ఆ మేరకు విద్యారంగంలో ఆధునిక సాంకేతికతను అమలుచేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఏపీ విద్యాశాఖ, టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ 2024 డిసెంబర్‌లో ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో భాగంగా టీబీఐ విజయవాడలో తమ బృందాన్ని నియమించుకొని గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏర్పాటు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యలో సంస్కరణలపై దృష్టి సారించింది. ఈ రెండు అంశాలపై జరిగిన పురోగతిని తాజాగా ఇద్దరు నాయకులూ సమీక్షించారు.

# కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలి

- అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి
- మౌలిక వసతులు, అభివృద్ధి
- పనులపై సమీక్ష సమావేశం
- సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.చంద్రశేఖర్





**రామచంద్రాపురం,దీక్ష ప్రభ:** రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ 1, 2ల సముదాయాల మౌలిక వసతులు, చేయవలసిన అభివృద్ధి పనులపై తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ ఎం.సంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.చంద్రశేఖర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, వనమహోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ ఎం.సంగారెడ్డి, అధికారులతో కలిసితో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మొక్కలను నాటారు. మొదటగా విద్యకు సంబందించి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల తరగతి గదులు, టీచర్స్, పిల్లల నమోదు, టాయిలెట్స్ తదితర వసతుల గురుంచి డీఈఓ వెంకటేశ్వర్లుతో చర్చించి, మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తిచేసి పాఠశాలలు ప్రారంభించవలసినదిగా ఎంఈఓ పి.పి రాథోడ్ ని ఆదేశించారు. వైకుంఠధామం,బరియల్ గ్రౌండ్ ల ఏర్పాట్లకు స్థల సేకరణకు సంబంధించి రామచంద్రాపురం తహాశీల్దార్ సంగ్రామ్ రెడ్డితో చర్చించి,వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి పంపినట్లయితే మున్సిపల్ అధికారులు పనులు ప్రారంభించాల్సిందిగా మున్సిపల్ అధికారులను ఆదేశించారు.డిగ్నిటీ హౌసెస్ అసోసియేషన్లు,కమిటీలు త్వరగా ఏర్పాటు చేసుకొని ఎన్నికల ప్రక్రియ త్వరగా పూర్తి చేయవలసిందిగా హౌసింగ్ శాఖను ఆదేశించారు.మున్సిపల్ నుండి ఇంటి పన్నుల నిర్ధారణ త్వరగా పూర్తి చేయవలసినదిగా, స్ట్రీట్ లైట్స్, స్టాప్ బోర్డ్స్, స్పీడ్ బ్రేకర్లు, రేడియల్ రోడ్లలో ఏర్పాటు చేయాల్సిందిగా,డ్రైనేజీ మరమ్మత్తులు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేయాల్సిందిగా కమిషనర్ కి సూచించారు. పిల్లల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్త అంగన్వాడి సెంటర్లు ఏర్పాటు చేయవలసిందిగా ఐసిడిఎస్ శాఖను ఆదేశించారు. కొత్త ఎస్.హెచ్.జి గ్రూప్ లను ఏర్పాటు చేసి వారి ద్వారా కొత్త రేషన్ షాపులను వెంటనే ఏర్పాటు చేయాల్సిందిగా మున్సిపల్ కమిషనర్,తహాశీల్దార్ లకు తెలియజేశారు.విద్యుత్ శాఖకు సంబంధించి సబ్ స్టేషన్, ఫ్లాట్ యజమానులకు గృహజ్యోతి పథకాన్ని అమలు చేయాలని ఆదేశించారు. బిఎస్ఎన్ఎల్ సిగ్నలింగ్ కమ్యూనికేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలకు మౌలిక వసతుల కల్పన టైంలైన్ లో పూర్తి చేసినట్లయితే గణనీయమైన అభివృద్ధి సాధించవచ్చని అడిషనల్ కలెక్టర్, అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాధికారి ఎస్.వెంకటేశ్వర్లు,సిడిపిఓ జయరాం, మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ ఆర్అండ్ బి.రమేష్,తహశీసిల్దార్లు సంగ్రామ్ రెడ్డి, రంగారావు, ఎంఈఓ పి.పి రాథోడ్, ఏఈఈలు సాయి మౌనిక, సత్యనారాయణ,శివ శంకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి నిఖిలేశ్వర్, మున్సిపల్ ఆర్ఓ వెంకటరామయ్య, మేనేజర్ అఖిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోధారణను కలసిన రాష్ట్ర మైనారిటీ కాంగ్రెస్ నాయకులు



**జహీరాబాద్,దీక్ష ప్రభ:** గత నెలలో ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్రకు రాయికోడ్ మండలంలోని సింగీతం గ్రామానికి చెందిన రాష్ట్ర మైనారిటీ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ సుల్తాన్,వెళ్లి యోగ క్షేమలతో తిరిగివచ్చిన అనంతరం నేడు సాయంత్రం హైదరాబాద్ మహానగరంలోని మినిస్టర్ క్వార్టర్స్ లో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ,వైద్యవిద్య శాఖ మాత్యులు సీలరపు దామోదర్ రాజనర్సింహ,ను మర్యాద పూర్వకంగా కలిసి వారికి హజ్ యాత్రలో ప్రత్యేక పనియమైన ఆబేజంజం నీరు,ఖార్జురలను ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ,అక్కడి విషయాలను అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా గాంధీ జన్మదిన వేడుకలు



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత భారత ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన ముగ్గురు ప్రధానుల కుటుంబం నుంచి వచ్చిన గొప్ప నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం సమానత్వం దేశభద్రత మహిళా సాధికారత యువత అభివృద్ధి వంటి అంశాలకు పెద్దపీట పడుతూ ప్రజల గొంతుగా నిలుస్తూ నిరంతరం ప్రజల కోసం పోరాటం చేస్తూ ముందుకు సాగుతున్నటువంటి మన రాహుల్ గాంధీకి నందికొట్కూరు నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు టి. షాజహాన్ బేగం నంద్యాల జిల్లా కార్యదర్శి మౌలాలి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వం మరింత అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ దేశ ప్రజలు ఎదురుచూపులు చూస్తున్నటువంటి రాహుల్ గాంధీ కి మన నందికొట్కూరు నియోజకవర్గం మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు షాజహాన్ బేగం నంద్యాల జిల్లా కార్యదర్శి మౌలాలి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలతో జూపాడు బంగ్లా మండలంలో పుట్టినరోజు వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మహిళలు ఒకరికొకరు కేకులు తినిపించుకుంటూ రాహుల్ గాంధీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా కార్యదర్శి మౌలాలి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారికి రాహుల్ గాంధీ మన దేశానికే ఒక రక్షక కవచం అని అలాంటివారు ప్రధానమంత్రి చేసుకోవడానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు అంతా మనం రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిని చేసే విధంగా కృషి చేస్తామని మరల ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకున్నారు.

# అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు న్యాయం చేయాలి

- సిపిఎం పార్టీ పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు




**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** వశిష్ట శ్రీ చైతన్య స్కూల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు న్యాయం చేయాలని సిపిఎం పార్టీ పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామంలోగల వశిష్ట శ్రీ చైతన్య స్కూల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు న్యాయం చేయాలని వశిష్ట శ్రీ చైతన్య యాజమాన్యంతో అవినీతికి పాల్పడుతున్న ఎంఈఓ పైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. వశిష్ట శ్రీ చైతన్య స్కూల్ వద్ద పిల్లల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చర్చలలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ..2025-2026 సంవత్సరానికి గాను రుద్రారం గ్రామంలో కొత్తగా ప్రారంభమవుతున్న వశిష్ట శ్రీ చైతన్య స్కూల్లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు అడ్మిషన్లు వశిష్ట శ్రీ చైతన్య యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా ఆన్ లైన్లో అడ్మిషన్లను ప్రారంభం చేసిందనీ అన్నారు. వశిష్ట శ్రీ చైతన్య గతంలో కొల్లూరు ప్రాంతంలో తరగతులను కొనసాగించిందని, అక్కడి నుండి రుద్రారం గ్రామంలో స్కూలు ఏర్పాటుకు ట్రాన్స్ఫర్ ఏర్పాట్లు చేసుకుందన్నారు. కానీ ఎలాంటి ట్రాన్స్ఫర్ ఆర్డర్లు గానీ, కొత్తగా స్కూలు ఏర్పాటు చేయుటకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని అన్నారు. గత సంవత్సరం చదువుకున్న విద్యార్థులు 400 మంది ఉంటే ప్రస్తుతం అదనంగా కొత్త అడ్మిషన్లు 200 మందికిపైగా అడ్మిషన్లు పొందినారని మొత్తం కలుపుకుంటే 650 మందితో స్కూలు నడుస్తుందని అన్నారు. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అడ్మిషన్ కోసం 10,500 రూపాయలు, హాస్టల్లో ఉండి పదవ తరగతి చదువుకోవడం కోసం 1,60,000 ఒక్కొక్క స్టూడెంట్ వద్ద డబ్బులు భారీగా వసూలు చేస్తున్నదని ఆరోపించారు.గత వారం రోజులుగా అనుమతి లేకుండా కొనసాగుతున్న వశిష్ట శ్రీ చైతన్య స్కూలు వద్దకు వచ్చిన ఎంఈఓ స్కూలు ప్రిన్సిపల్ పైన ఎలాంటి చర్యలు తీసుకోకుండా, సాయంత్రం వరకు పటాన్ చెరు పోలీస్ స్టేషన్లో ఉండి ఎందుకు కేసు పెట్టలేదని ఎంఈఓ ను ప్రశ్నించారు. వశిష్ట శ్రీ చైతన్య యాజమాన్యంతో ఎంఈఓ కుమ్మకు అయ్యారని మండిపడ్డారు. గుర్తింపు లేని స్కూలులో పిల్లలు ఏ విధంగా విద్యను అభ్యసిస్తారని ప్రశ్నించారు. ఏడవ, పదవ తరగతి విద్యార్థులకు బోర్డ్ ఎగ్జాం ఏ స్కూలు పైన ఎగ్జామ్స్ రాయిస్తారని అన్నారు. విద్యార్థినీ విద్యార్థుల జీవితాలతో చెలగంట మాడుతున్న వశిష్ట స్కూల్ యాజమాన్యం, మండల ఎంఈఓ పైన చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో సిపిఎం పార్టీ తరఫున స్కూలు వద్ద,జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

## జాతీయ రహదారి భూ సేకరణ వివరాలు అందజేయాలి

- ధరణి పెండింగ్ ఫైల్స్ క్లియర్ వెంటనే చేయాలి
- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

**కోటగిరి,దీక్ష ప్రభ:** జాతీయ రహదారి 161బీబీ నిర్మాణ పనుల కోసం అవసర మైన భూసేకరణ వివరాలు సేకరించి త్వరగా భూములు నష్టపోతున్న వారి వివరాలు తమకు అందజేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో రెవెన్యూ అధికారులకు సూచించారు.పోతంగల్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. మద్నూర్ నుండి రుద్రూర్ వరకు నిర్మించే జాతీయ రహదారి నిర్మాణంవల్ల పోతంగల్ మండలంలో కోల్పోతున్న భూముల వివరాలు, సర్వే చేసి నివేదిక అందజేయాలన్నారు. అనంతరం ధరణి పెండింగ్ ఫైల్స్ గురించి ఆరా తీశారు. పెండింగ్ ఫైల్స్ను వెంటనే పూర్తి చేయాలన్నారు. మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలిస్తూ నిర్ణీత గడువులోపు రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో తాసిల్దార్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## టీపీసీసీ జనరల్ సెక్రెటరీని కలిసిన జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు



**కోటగిరి,దీక్ష ప్రభ:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ డాక్టర్ గిరిజను కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పుప్పాల అబి షేక్ హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిశారు.టీపీసీసీ జనరల్ సెక్రెటరీగా ఇటీవల నియమితురాలైన గిరిజ షెట్కార్ కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు ఆమెను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో యూత్ కాంగ్రెస్ పనితీరును ఆమెకు వివరించారు. రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికలు ఉన్నందున ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత యూత్ కాంగ్రెస్ నిర్వహించాలని ఆమె సూచించినట్లు చెప్పారు.

## అధిష్టానం సహకరించి ప్రజలు దీవిస్తే స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగిరేస్తాం

- కాశాయ జెండా ఎగరేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు
- కార్యకర్తలను సమన్వయ పర్చి ముందుకు సాగే నాయకులకు అవాశమివ్వాలి
- స్థానిక లీడర్లను ప్రోత్సహిస్తే మరిన్ని మంచి ఫలితాలుంటాయి
- దీక్ష ప్రభతో బీజేపీ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పైడిమల్ లక్ష్మీనారాయణ



**కోటగిరి,దీక్ష ప్రభ:** బీజేపీ అధిష్టానం సహకరిస్తే రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేపీ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పైడిమల్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇటీవల దీక్ష ప్రభలో ప్రచురితమైన "బాన్సువాడ బీపీకి బాస్ ఎవరు..?"అనే వార్తా కథనానికి స్పందించి ఆయన దీక్ష ప్రభతో మాట్లాడుతూ..బాన్సువాడలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ నుండి నేటి వరకు స్థానికులకు ఎమ్మెల్యేగా,నియోజకవర్గ ఇంఛార్జిగా అవకాశం రాలేదని చెప్పారు. స్థానిక లీడర్లను ప్రోత్సహిస్తే స్థానిక ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బాన్సువాడలో బీజేపీ కార్యకర్తలు కాశాయ జెండాను ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నారని వారిని సమన్వయ పరుస్తూ కలుపుకుపోయే స్థానిక లీడర్ నియోజకవర్గ స్థాయిలో ఉంటే జెండా ఎగరటం ఖాయమన్నారు. ప్రస్తుతం బీఆరెస్ నుండి గెలిచిన పోచారం కాంగ్రెస్ లోకి వెళ్లటంతో ప్రజల పక్షాన పోరాడే అవకాశం బీజేపీ పార్టీకి లభించిందని ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసేందుకు కార్యకర్తలను సమన్వయ పర్చి అందరినీ కలుపుకుని ముందుకు సాగిపోయే నాయకుడిని వెంటనే నియమించాలని అధిష్టానాన్ని కోరారు. నియోజకవర్గంలో దాదాపు 30 ఏండ్లుగా పార్టీకోసం పనిచేస్తున్న లీడర్లు ఉన్నారని అధిష్టానం గుర్తించి అవకాశమిస్తే ప్రజలు బీజేపీని దీవించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

### ఇప్పటివరకు స్థానిక లీడర్లకు అవకాశం దక్కలేదు...!

ఆనాటి నుండి బాన్సువాడ నియోజకరవ్గంలో ఒక్క మాల్యాద్రి రెడ్డి మినహా స్థానిక లీడర్కు నియోజకవర్గ ఇంఛార్జ్ గా అవకాశం దక్కలేదని 2014 ఎన్నికల్లో కూటమి లో భాగంగా బాన్సువాడ టికెట్ టీడీపీకి వచ్చిందని,2018 ఎన్నికల్లో జుక్కల్ బరిలో ఉన్న నాయుడు ప్రకాశ్ను అరుణాతార రాకతో బాన్సువాడ టికెట్ ఇచ్చారని,2023 ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీ నారాయణకు బీజేపీ టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. అప్పటి నుండి ఆయనే ఇంచార్జ్ గా ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ఇంఛార్జ్ గా స్థానికులు ఉంటే కార్యకర్తలకు బలం చేకూరుతుందన్నారు. కార్యకర్తలకు సమస్యలు వచ్చినా ప్రజల సమస్యలపై కార్యకర్తలు పోరాడాలన్నా వారివెనుక ఉండే నాయకుడు స్థానికంగా ఉంటే ఆ ధైర్యంతో కార్యకర్తలు ఎందాకైనా పోరాడగలని చెప్పారు.ఇప్పటికైనా అధిష్టానం స్థానిక లీడర్లకు అవకాశం ఇస్తే పార్టీని బలోపేతం చేసేందుకు ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరేసేందుకు కార్యకర్తలు , నాయకులు సిద్ధంగా ఉన్నారని అధిష్టానానికి గుర్తుచేశామని చెప్పారు. ఏది ఏమైనా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడని ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు బిజెపితో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బిజెపికి స్థానిక ఎన్నికల్లో మద్దతు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలు అవకాశం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. బిజెపి రాష్ట్ర అధిష్టానం మరికొంత దృష్టి సారిస్తే స్థానిక ఎన్నికల్లో బిజెపికి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని చెప్పారు.

## ఎంపీడీవో ఆఫీస్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా

- రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్

**కోటగిరి,దీక్ష ప్రభ:** గ్రామ పంచాయతీ కార్మికుల రెండు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని గురువారం కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ చందర్ తో చర్చలు జరిగాయని, నాలుగు రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు. అనంతరం నన్నేసాబ్ మాట్లాడుతూ..ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులను చిన్నచూపు చూస్తుందని అధికారులు సైతం జీపీ కార్మికులను చూస్తున్నారని మండిపడ్డారు. బకాయి వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, డిపిఓ, డిఎల్ పిఓ జిల్లా ఉన్నతాధికారులు గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించడంపై దృష్టి సారించాలని కోరారు. లేకపోతే గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి పంచాయతీ కార్యాలయం ఎదుట పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు శేఖర్, పోశెట్టి, లింగవ్వ, బ్రహ్మం, సాయవ్వ, లక్ష్మి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత భారత ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన ముగ్గురు ప్రధానుల కుటుంబం నుంచి వచ్చిన గొప్ప నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం సమానత్వం దేశభద్రత మహిళా సాధికారత యువత అభివృద్ధి వంటి అంశాలకు పెద్దపీట పడుతూ ప్రజల గొంతుగా నిలుస్తూ నిరంతరం ప్రజల కోసం పోరాటం చేస్తూ ముందుకు సాగుతున్నటువంటి మన రాహుల్ గాంధీకి నందికొట్కూరు నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు టి.షాజహాన్ బేగం నంద్యాల జిల్లా కార్యదర్శి మౌలాలి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వం మరింత అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ దేశ ప్రజలు ఎదురుచూపులు చూస్తున్నటువంటి రాహుల్ గాంధీ కి మన నందికొట్కూరు నియోజకవర్గం మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు షాజహాన్ బేగం నంద్యాల జిల్లా కార్యదర్శి మౌలాలి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలతో జూపాడు బంగ్లా మండలంలో పుట్టినరోజు వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మహిళలు ఒకరికొకరు కేకులు తినిపించుకుంటూ రాహుల్ గాంధీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా కార్యదర్శి మౌలాలి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారికి రాహుల్ గాంధీ మన దేశానికే ఒక రక్షక కవచం అని అలాంటివారు ప్రధానమంత్రి చేసుకోవడానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు అంతా మనం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే విధంగా కృషి చేస్తామని మరల ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకున్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు రోజు శుభాకాంక్షలు



**కోటగిరి,దీక్ష ప్రభ:** ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి జన్మదిన వేడుకలలో మండల మాజీ కో ఆప్షన్ మెంబర్ డాక్టర్.ఎంఏ.హకీమ్ పాల్గొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుప్పాల శంకర్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కో ఆప్షన్ మెంబర్ డాక్టర్. ఎంఏ. హకీం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల శంకర్ కు కేక్ తినిపించారు. అంతరం కార్యకర్తలకు కేక్,స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో జల్లాపల్లి మాజీ సర్పంచ్ షేరు, మాజీ ఎంపీటీసీ రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యశ్వంత్,తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోతంగల్ లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**కోటగిరి,దీక్ష ప్రభ:** కాంగ్రెస్పార్టీ పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పోతంగల్ మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ మాట్లాడుతూ..దేశంలోని సమస్యలపై కేందరం ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని అన్నారు. యూత్ అధ్యక్షులు చాంద్ పాషా, మాజీ ఎంపీటీసీ కేశ వీరేశం, సీనియర్ నాయకులు గంధపు పవన్,ఎంఏ హకీమ్,మన్సుర్యాత్ కాంగ్రెస్ నాయకులు గంధపు రాజు, భజరంగ్ దత్తు, ధన్ రాజ్, షేరు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 21న పటాన్ చెరులో అంతర్జాతీయ యోగా దినోత్సవం

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- మైత్రి మైదానంలో భారీ ఏర్పాట్లు
- భారీ సంఖ్యలో హాజరుకానున్న విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు,అధికారులు





**పటాన్ చెర్,దీక్ష ప్రభ:** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 21వ తేదీ శనివారం ఉదయం ఏడు గంటల నుండి 9 గంటల వరకు పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో భారీ స్థాయిలో యోగా దినోత్సవం వేడుకలు ఏర్పాటు చేస్తున్నట్లు పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.బుధవారం క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, యోగ నిర్వహణ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మైత్రి మైదానంలో యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యోగ యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో ఈ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యోగ అనే పదం పరమాత్మతో మనస్సు యొక్క అనుసంధానం ఫలితంగా పరిపూర్ణమైన సమస్థితిని లేదా మానసిక సమతుల్యతను సూచిస్తుందని తెలిపారు. యోగ దినోత్సవంలో ప్రతి ఒక్కరి పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సీఐ వినాయక్ రెడ్డి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ ట్రెజరీ ఆఫీసర్ కు శాలువ కప్పి ఘనంగా సన్మానించిన ఉపాధ్యాయులు



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** ఎమ్మిగనూరు సబ్ ట్రెజరీ ఆఫీస్ నుంచి ఇటీవల సబ్ ట్రెజరీ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎం .రాజును ఉపాధ్యాయులు సన్మానించారు. గురువారం స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో వడ్డేమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్సు ఉపాధ్యాయుడు అల్లీ హుస్సేన్ మరియు ల్యాబ్ అసిస్టెంట్ రమేష్, నందికొట్కూరు కోట బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు డి.ఈశ్వరయ్య లు కలిసి పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ అందుబాటులో ఉంటూ తమకు సహాయ సహకారాలు అందించాలని ఉపాధ్యాయులు ఆయనను కోరారు.

# ప్రతిష్టాత్మక ఏఐ సదస్సులో గీతం ప్రాతినిధ్యం

- లండన్ సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొని, ప్రసంగించిన ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్
- పరిశోధనా పత్రాన్ని సమర్పించి అంతర్జాతీయ నిపుణుల ప్రశంసలందుకున్న గీతం విద్యార్థులు



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాదులోని సీఎస్ఈ విభాగం అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ ఇటీవల లండన్ లో నిర్వహించిన కృత్రిమ మేధస్సు (ఏఐ) సదస్సులో విశిష్ట అతిథిగా పాల్గొని, కీలకోపన్యాసం చేశారు. ఈ విషయాన్ని గీతం వర్గాలు బుధవారం వెల్లడించారు. యునైటెడ్ కింగ్డమ్ (లండన్)లో ఈ నెలలో (జూన్) జరిగిన 13వ అంతర్జాతీయ ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ థియరీ అండ్ అప్లికేషన్స్ (%ఖీ×జూా%-2025) సదస్సులో ఆమె గీతంకు ప్రాతినిధ్యం వహించినట్టు తెలియజేశారు. లండన్ మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయంలో కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్ (ఏఐ అండ్ డీఎస్) పరిశోధనా బృందం నిర్వహించిన ఈ సమావేశంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు పాల్గొన్నట్టు వెల్లడించారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ లో ఎదురయ్యే సవాళ్లు,వాటి వినియోగంపై గీతం అధ్యాపకురాలు ప్రొఫెసర్ పర్వేకర్ కీలకోపన్యాసం చేశారన్నారు. విభిన్న పరిశ్రమలలో ఏఐ-ఎంఎల్ యొక్క క్లిష్టమైన పురోగతులు, వాస్తవ-ప్రపంచ వినియోగాలను ఆమె వివరించినట్టు తెలిపారు. సెర్బియాలోని సింగిడునమ్ విశ్వవిద్యాలయంలో ఆతిథ్య ఉపన్యాసకురాలిగా కూడా సేవలందిస్తున్న ప్రొఫెసర్ పర్వేకర్, అంతర్జాతీయ విద్యాపరమైన సంబంధాలు, సహకారాలకు ఊతమిస్తోందన్నారు. ప్రొఫెసర్ పర్వేకర్ మార్గదర్శనంలో సీఎస్ఈ చివరి ఏడాది విద్యార్థులు జి.సోహన్ కుమార్ రెడ్డి, ఆదిచేతన్ ఖోట్, టి.ఆశ్రిత్, బి.మణిచరణ్ రెడ్డి తదితరులు ఈ-కామర్స్ సైట్ల కోసం ఆటోమేటిక్ ధర పర్యవేక్షణ అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించినట్టు తెలియజేశారు. ఈ పత్ర రూపకల్పన కోసం వారు చేసిన కృషి, దాని ఔచిత్యం, అందులోని ఆవిష్కరణలు అంతర్జాతీయ నిపుణుల ప్రశంసలు పొందాయన్నారు. ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదికలో గీతం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని పరిశోధన, ఆవిష్కరణ, ప్రపంచ విద్యా కార్యకలాపాలలో రాణించడం గీతం యొక్క నిబద్ధతను ప్రస్ఫుటీకరిస్తున్నట్టు పేర్కొన్నారు.




# జూలై 9న దేశ వ్యాప్త సమ్మె

- గ్రామీణ బందును జయప్రదం
- కార్మిక, కర్షకులను మరిచిన మోడీ
- సీఐటీయూ రాష్టకమిటీ సభ్యులు కే.రాజయ్య



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంధును జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య అన్నారు. గురువారం పటాన్ చెరు మండలం రుద్రారం శివారులో గల తోషిబా పరిశ్రమలో జూలై 9న జరపతల పెట్టిన దేశవ్యాప్త సమ్మెను పురస్కరించుకొని జరిగిన సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ..కార్మిక ఉద్యోగ వివిధ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యోగులు కార్మికుల సమ్మె చేస్తున్నారని, రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామీణ బంద్ కు పిలుపునిచ్చాయని, కార్మికులు, రైతులు, కూలీలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. దేశంలో ఏ ఒక్కరి సమస్యలు కూడా మోడీ ప్రభుత్వం పరిష్కరించడం లేదని, మోడీ ప్రభుత్వం పచ్చి కార్మిక వ్యతిరేకి అని విమర్శించారు. మోడీ విధానాలపై కార్మికులు తిరగబడాలని అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లకు రద్దు కోసం పోరాడాలని అన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలని తెలిపారు. శ్రామికుల శ్రమను దోచుకునేందుకు వీలుగా ప్రధానమంత్రి మోడీ నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని చూస్తున్నారని, లేబర్ కోడ్ లో అమల్లోకి వస్తే 95% మంది కార్మిక వర్గం వెట్టి చాకిరిలోకి నెట్టబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ లేబర్ కోడ్స్ లో పొందుపరిచారని ఆరోపించారు,కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ,బోనస్ వంటి సదుపాయాలు అందని ద్రాక్షగా మారుతాయి అన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం అంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## పటాన్ చెరు రైతులకు రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయండి

- మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్
- ప్రతి రైతుకు రైతు భరోసా అందించే వరకు అండగా ఉంటాం



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా నిధులు పటాన్ చెరు నియోజకవర్గంలోని రైతులకు జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూడు రోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా రైతులందరికీ రైతు భరోసా నిధులు విడుదల చేస్తూ..ప్రభుత్వం ఆదేశాలు ప్రకటించిన నేపథ్యంలో, పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని 27,120 మంది రైతులకు నిధులు జమ కాలేదన్న విషయం తెలియడంతో గురువారం ఉదయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి ఫోన్ చేసి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేశారు. రైతు భరోసా నిధులు జమ కాకపోవడంతో వ్యవసాయ పనులు ప్రారంభించడం కష్టతరంగా మారిందని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు ఉండగా కేవలం గుమ్మడిదల మండల రైతులకు మాత్రమే నిధులు జమ అయ్యాయని తెలిపారు. మిగిలిన రామచంద్రాపురం, అమీన్ పూర్, పటాన్ చెర, జిన్నారం మండలాల పరిధిలోని 27,120 మంది రైతులు 43,302 ఎకరాల్లో వ్యవసాయం సాగు చేస్తున్నారని, వీరందరికీ తొలి విడత రైతు భరోసా ద్వారా 12 కోట్ల 99 లక్షల రూపాయలు నిధులు విడుదల కావలసి ఉందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల అతి త్వరలో రైతులందరికీ రైతు భరోసా నిధులు అందజేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు.ఈ అంశంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా అందించే వరకు తాను అండగా ఉంటానని పటాన్ చెరు రైతాంగానికి ఎమ్మెల్యే జీఎంఆర్ హామీ ఇచ్చారు.

## జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- సిసి రోడ్లు, యూజీడి పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే పాత్రికేయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం జీఎంఆర్ మోడల్ జర్నలిస్ట్ కాలనీలో 50 లక్షల రూపాయల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్లు,యూజీడి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పటాన్ చెరు నియోజకవర్గంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం రెండు సంవత్సరాల క్రితం వందమంది జర్నలిస్టులకు ఇంటి స్థలాలు అందజేయడం జరిగిందని తెలిపారు. ఆయా కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలతో పాటు 60 లక్షల రూపాయల సొంత నిధులతో ఆరోగ్య భీమాను సైతం అందించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకుని వచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి,డీఈ సత్యనారాయణ, ఏఈ మౌనిక,సీనియర్ నాయకులు అంతిరెడ్డి, బండి శంకర్, జంగారెడ్డి, రామచందర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.





## రసాయన శాస్త్రంలో జ్యోత్స్న మెండాకు పీహెచ్ డీ



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని జ్యోత్స్న మెండా డాక్టరేట్ కు అర్హత సాధించారు. యూపీఎల్సీలో డిజైన్ విధానం ద్వారా నాణ్యత యొక్క వినియోగం, ఎంచుకున్న మోతాదు రూపాలు, వాటి స్థిరత్వం కోసం విశ్లేషణాత్మక పద్ధతి అభివృద్ధి, ధ్రువీకరణపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఫణి రాజా గురువారం ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ జ్యోత్స్న చేసిన ఆదర్శప్రాయమైన పరిశోధన విశ్లేషణాత్మక (అనలిటికల్) రసాయన శాస్త్ర రంగానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు.ఈ అధ్యయనంలో ఆమె రెమోగ్లిఫ్లోజిన్, టెనెలిగ్లిప్టిన్, ఓలాన్జాపైన్,సమిడోర్ఫాన్, రిటోనావిర్, దారుసవిర్ తో సహా వివిధ ఔషధ సమ్మేళనాల అంచనా కోసం RP-UPLC విశ్లేషణాత్మక పద్ధతులను అభివృద్ధి చేయడం, ధృవీకరించడంపై దృష్టి సారించినట్టు తెలిపారు. అంతర్జాతీయ హార్మోనైజేషన్ కౌన్సిల్ (సీపీహెచ్) మార్గదర్శకాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన ఈ పద్ధతులు, తక్కువ రన్ టైములు, తక్కువ ఫ్లో రేట్లను ఉపయోగించుకుంటూ అధిక ఖచ్చితత్వం, ఖచ్చితత్వం, సున్నితత్వం, దృఢత్వాన్ని ప్రదర్శించాయన్నారు. ఈ పరిశోధన నాణ్యత ద్వారా డిజైన్ (QbD) సూత్రాలను, ప్రయోగాల రూపకల్పన (DoE) సూత్రాలను సమర్థవంతంగా వర్తింపజేసి, పద్ధతి విశ్వసనీయతను నిర్ధారించడానికి, ముఖ్యంగా ఔషధ విశ్లేషణ, స్థిరత్వ అధ్యయనాలకు ప్రయోజనం చేకూరుస్తుందని వివరించారు. డాక్టర్ జ్యోత్స్న సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు పేర్కొన్నారు. గీతం అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహిస్తూ, స్కాలర్ల విద్యా నైపుణ్యాలను పెంపొందిస్తోందని తెలిపారు.

## లేబర్ కోడ్లు అమలయితే వెట్టి చాకిరిలోకి కార్మిక వర్గం

- జూలై 9న దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయండి
- వివిధ పరిశ్రమలలో గేట్ సమావేశాలు
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య



**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** లేబర్ కోడ్ లు అమలయితే వెట్టి చాకిరిలోకి కార్మిక వర్గం నెట్టబడుతుందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య అన్నారు. పటాన్ చెరు మండలం ఐడిఏ పాశమైలారంలోని సినర్జి, వ్యాగ్ వాల్స్ పరిశ్రమల వద్ద జరిగిన కార్మికుల గేట్ మీటింగ్ లలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య పాల్గొని మాట్లాడుతూ... జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు, మోడీ ప్రభుత్వం పచ్చి కార్మిక వ్యతిరేకని, మోడీ విధానాలపై కార్మికులు తిరగబడాలని, నాలుగు లేబర్ కోడుల రద్దు కోసం పోరాడాలని అన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన ఆర్థిక విధానాల ప్రభావంతోటే కార్పొరేట్ శక్తులు పెట్టుబడిదారులు తమ లాభాలు పెంచుకొని కుబేరులవుతున్నారన్నారని, వారికి మరింత లాభం చేకూర్చి శ్రామికుల శ్రమను దోచుకునేందుకు వీలుగా ప్రధానమంత్రి మోడీ నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. లేబర్ కోడ్లో అమల్లోకి వస్తే 95% మంది కార్మిక వర్గం వెట్టి చాకిరిలోకి నెట్టబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ లేబర్ కోడ్స్ లో పొందుపరిచారని, కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్ వంటి సదుపాయాలు అందని ద్రాక్షగా మారుతాయన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శాంతకుమార్,హరినాథ్ రెడ్డి కృష్ణారెడ్డి, ఆఫీజె, మురళి, రాజు, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.